క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు

తంబళ్లపల్లె: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు సాధ్యమని సీహెచ్‌సీ గైనకాలజిస్టు తేజస్వి తెలిపారు. మంగళవారం కోసువారిపల్లె పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో గర్భిణులను గుర్తించిన వెంటనే ప్రతి నెలా అన్ని రకాల పరీక్షలతో పాటు వైద్య సలహాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగే విధంగా ఆశా కార్యర్తలు సహరించాలన్నారు. ప్రతి నెలా 30 డెలివరీలు జరిగే విధంగా కృషి చేయాలన్నారు. సీహెచ్‌సిలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ, హెడ్ నర్సు గ్లోరి లిటిల్ ఫ్లవర్, సూపర్‌వైజర్ అమరావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రామసముద్రం: పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని చొక్కాండ్లపల్లి పంచాయతీ బిక్కంవారిపల్లె సమీపంలోని చింత తోపులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి శిబిరంపై దాడి చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారితో పాటు రూ.12,480లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైన పాల్పడితే సహించేది లేదని ఎస్‌ఐ హెచ్చరించారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

కలకడ : మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మలంషావల్లి, జనసేన మండలశాఖ అధ్యక్షుడు సుదర్శన్, ఉపధ్యక్షుడు గంగాధర అన్నారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులచే మొక్కలు నాటించి నీరు పోయించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదినం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు హసన్‌బాషా, ఎజాజ్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కంటైనర్ బోల్తా

పీలేరు రూరల్ : అదుపుతప్పి కంటైనర్ బోల్తా పడిన సంఘటన మంగళవారం ఉదయం మండలంలోని వెంకటాద్రిళ్లవద్ద చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. కడప నుంచి నుంచి సున్నపురాయి లోడుతో తమిళనాడు వెళుతున్న కంటైనర్ వెంకటాద్రిళ్ల వద్ద స్టీరింగ్ కట్ అయి కల్వర్టును ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా ప్రయాణాలతో బయటపడడంతో పెనుప్రమాదం తప్పింది. ఎస్‌ఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

పీహెచ్‌సీ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రమేష్‌బాబు

ములకలచెరువు: స్థానిక పీహెచ్‌సీని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రమేష్‌బాబు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధులపై అప్రమత్తమగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో జ్వరాలు ఎక్కువగా ఉన్న చోట వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలు అందించాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డాక్టర్ జాహ్నవిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మహమ్మద్‌ఖాన్‌కు శ్రేష్టగురు అవార్డు



మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న పఠాన్ మహమ్మద్‌ఖాన్ శ్రేష్టగురు అవార్డుకు ఎంపికయ్యారు. విసపోర్టు చారిటబుల్ ట్రస్టు, రేవతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం తిరుపతిలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ భానుప్రకాష్ తనిఖీ చేశారు. విద్యార్థులను భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత గురించి తెలియజేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రాజగోపాల్, హెచ్‌ఎం జనార్ధన్‌రెడ్డి, పీడీ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

ములకలచెరువు: విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం వండి పెట్టాలని ఎంపీడీఓ పోలప్ప, ఎంఈఓ వెంకటరమణ వంట ఏజెన్సీలకు ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం వారు స్థానిక జెడ్పీహైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనం నాణ్యతపైన విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత అవసరమని విద్యార్థులకు సూచించారు.

చినుకుపడితే.. చెరువే..!



జలమయంగా మారిన బెంగళూరు బస్టాండు



షాపుల వద్ద పొంగిపొర్లుతున్న వర్షపు నీరు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- చిన్నపాటి వర్షానికే వీధులు జలమయం
- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- రోడ్లపై రాకపోకలకు అంతరాయం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు చెరువైపోతుంది. రోడ్లపై మోకాళ్లలోతు నీళ్లు నిలిచిపోతున్నాయి.దీంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. సోమవారం రాత్రి పట్టణంలో వర్షం కురిసింది. దీంతో బెంగళూరు బస్టాండు, పీ అండ్ టి కాలనీ, నిమ్మనపల్లె క్రాస్, కదిరిరోడ్డు ప్రాంతాలు జలమయ్యాయి. డ్రైనేజీ కాలువలు దెబ్బతినడంతో పాటు పాత కాలం నాటి కాలువలు కావడంతో వర్షపు నీటితో పాటు డ్రైనేజీ నీరు పొంగిపొర్లిపోతుంది. దుర్వాసనకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు కదిరిరోడ్డులోని జడ్జి బంగ్లా వద్ద వర్షం కురిస్తే చాలు డ్రైనేజీ కాలువలో నీళ్లు పొంగిపొర్లి పెద్ద చెరువుగా మారుతుంది. కనీసం రోడ్లుపై వెళ్లాలంటే కష్టం. గత రెండు నెలల నుంచి కాలువ మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దెబ్బతిన్న డ్రైనేజీ కాలువలు

పట్టణంలో పలు వార్డుల్లో డ్రైనేజీ కాలువలు దెబ్బతిన్నాయి.వీటిస్థానంలో కొత్త కాలువలు నిర్మాణాలు చేపట్టలేదు. పాతకాలం నాటి కాలువలు కావడంతో మురుగునీరు ఎక్కడ చూసినా పొంగిపొర్లుతుంది. దుర్వాసనకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎక్కడ చూసినా డ్రైనేజీ సమస్య కన్పిస్తోంది. వర్షాకాలం కావడంతో ఈ సమస్య మరింత ఎక్కువైంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. కనీసం కొత్త కాలువలు నిర్మాణాలు చేపట్టి డ్రైనేజీ సమస్య లేకుండా, వర్షం కురిస్తే కాలువల్లో నీరుపోయేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



చింతపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది,



కలికిరి: నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: నేత్రదానం చేసి, చిరంజీవిగా ఉందామని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. మంగళవారం 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించి, చింతపర్తి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరేంద్రియానం నయనం ప్రధానం అన్నారు. శరీరంలోని అన్ని అవయవాలలో కళ్లు చాలా ముఖ్యమైనవని, నేత్రదానం ప్రాముఖ్యతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జులేఖ బేగం, వైద్య సిబ్బంది ఇంద్రాణి, మహమ్మద్ రఫీ, సుధాకర్, భానుబీ, విజయ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైత్యవంతులను చేయాలి

కలికిరి: నేత్రదానంపై క్షేత్ర స్థాయిలో ప్రజలను చైతన్యవంతులను చేయాలని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి కావ్యగంధ అన్నారు. నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం మేడికుర్తి పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్రదానంపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ రంగ సేవా సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. నేత్రదానానికి సిబ్బంది తమ వంతుగా కృషి చేయాలన్నారు. బీపీ, షుగరు వ్యాధి గ్రస్తులు కూడా నేత్ర దానానికి అర్హులని హెచ్‌ఈ మహ్మద్ రఫీ తెలిపారు. స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ హేమలత, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

పెద్దతిప్పసముద్రం: స్థానిక బీసీ హాస్టల్‌ను ఎంపీడీఓ కేఎస్ బాలాజీ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లో విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులపై ఆరా తీశారు. హాస్టల్‌లో పరిసరాల పరిశుభ్రత, వంట గదిని క్షుణంగా పరిశీలించారు. నాణ్యమైన భోజనం వండుతున్నారా, హాస్టల్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 30 మంది విద్యార్థులకు గానూ 22 మంది హాజరైనట్లు ఎంపీడీఓ గుర్తించారు.

భూ తగాదాలో దాడి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లి పంచాయతీ సొన్నువారిపల్లికి చెందిన ఓబులేసు అనే వ్యక్తిపై భూతగాదాల కారణంగా ముగ్గురు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయ పరిచారు. గాయపడిన బాధితుడి భార్య సరోజమ్మ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన రాజేంద్ర, శ్రీనివాసులు, రంజిత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు మంగళవారం పేర్కొన్నారు.

వరద బాధితులకు బ్రెడ్డు వితరణ

మదనపల్లె సిటీ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కోసం స్థానిక శేఖర్ స్వీట్స్ యజమాన్యం సుమారు రెండు వేల బ్రెడ్డులు తమ సొంత వాహనంలో పంపారు. మంగళవారం షాపు వద్ద నుంచి ప్రత్యేక వాహనంలో బ్రెడ్డు ప్యాక్ చేసి వరద ముంపు ప్రాంతాల్లో అందజేయనున్నట్లు శేఖర్ స్వీట్స్ యజమానులు ముత్తుస్వామి, బాలసుబ్రమణ్య, మమత తెలిపారు. వరద ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న కష్టాలు చూసి చేతనైనంత సహాయం అందించాలని ఉద్దేశంతో బ్రెడ్స్ పంపినట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాలని కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం టాప్ అకాడమీ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇందులో 10 మంది ఎంపికయ్యారు. వీరికి సంవత్సరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల వరకు ప్యాకేజీ ఇవ్వడం జరుగుతుందని కాలేజీ డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఎల్వోలు క్షేత్రస్థాయిలో విచారణ చేయాలి

– సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : ఓటరు నమోదు ప్రక్రియ, సవరణలు, మార్పులు, చేర్పులకు సంబంధించి బీఎల్వోలు వారి వారి పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కచ్చితమైన వివరాలను నమోదుచేయాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టరేట్‌లో మంగళవారం మదనపల్లె మండలానికి సంబంధించిన బీఎల్వోలతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ...బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఎంత మంది ఓటర్లు ఉన్నారు ? చనిపోయిన, బదిలీ అయిన ఓటర్లు ఉన్నారా? ఓటరుకార్డులో మార్పులు, చేర్పులు ఏమైనా ఉన్నాయా ? తదితర వివరాలను ప్రశ్నించి నమోదుచేసుకోవాలన్నారు. ఏవైనా తొలగింపులుంటే వాటికి సంబంధించిన ఆధారాలు తీసుకుని, కుటుంబసభ్యుల అనుమతితోనే చేయాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియలో బీఎల్వోలు జాగరూకతతో వ్యవహరించాలని, నిర్లక్ష్యంగా పనిచేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కొత్తగా ఓటరు నమోదుచేసుకునే వారికి సంబంధించి తప్పనిసరిగా వయస్సు ధృవీకరణ పత్రాలను లేదా స్టడీ సర్టిఫికేట్స్ తీసుకున్నాకే ఆన్‌లైన్‌లో నమోదుచేయాలన్నారు. ఆరోగ్యకరమైన ఓటరు జాబితా రూపకల్పనలో బీఎల్వోలు కీలకమని, ప్రతి ఒక్కరూ పారదర్శకంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, ఎలక్షన్ డీటీ అస్లాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



కురవంక ముంపు ప్రాంతంలో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో అధికారులు బాధ్యతతో పనిచేయాలని, లేనిపక్షంలో కఠినచర్యలు తీసుకునేందుకు వెనుకాడే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హెచ్చరించారు. పట్టణంలోని పీఅండ్‌టీ కాలనీ పార్క్ సమీపంలోని కురవంక ముంపు ప్రాంతాన్ని మంగళవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పరిశీలించారు. ఎక్కడ చూసినా వర్షపునీరు, మురుగునీరు నిల్వ ఉండటంతో పాటుగా పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తాను మూడోసారి కురవంక ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్నానని, గతంలో తాను సూచించిన పనులు జరగలేదని, అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం కనపరిస్తే సహించేది లేదన్నారు. కాలువల మీదుగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, కాలువల్లో పూడికలు తీయకపోవడంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోందని, చెత్త కుప్పలు చాలాకాలంగా అక్కడే ఉన్నట్లు కనిపిస్తున్నాయని అధికారులను నిలదీశారు. పంచాయతీ, మున్సిపాలిటీ అధికారుల మధ్య సమన్వయ లోపంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెప్పడంతో పంచాయతీ, మున్సిపాలిటీకి చెందిన ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ సిబ్బందిని కురవంకకు రావాల్సిందిగా కోరారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వారధిగా అధికారులు

కలకడ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రతి మండలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వారధులుగా మండల పరిషత్ అధికారులు ఉండాలని చిత్తూరు జిల్లా పరిషత్ సీఈఓ గ్లోరియ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. మండల పరిషత్ నిధులు, పంచాయతీలకు కేటాయింపులు, బిల్లుల చెల్లింపులు, జమ-ఖర్చులకు సంబంధించిన బిల్లులు, ఆడిట్ వంటివాటిపై సమగ్ర నివేదికలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం

రామసముద్రం: కుటుంబ కలహాలతో ఓ మహిళ మంగళవారం రాత్రి పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించింది. రామసముద్రం మండలం ఆర్.నడింపల్లి పంచాయతీ జంగాలపల్లి గ్రామానికి చెందిన మహిళ (27) కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది పురుగు మందుతాగింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి రామసముద్రం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పుంగనూరు ఆసుపత్రికి రెఫర్ చేశారు.

ప్రతి నియోజకవర్గంలో జాబ్‌మేళాలు

మదనపల్లె సిటీ: జిల్లాలో ప్రతి నెలా ఒక్కో నియోజకవర్గంలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్య డీఈఓ దోనప్ప తెలిపారు. మంగళవారం స్థానిక నిమ్మనపల్లెరోడ్డులోని జీఆర్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రముఖ ఐదు కంపెనీలు జాబ్‌మేళాకు హాజరయ్యారు. ఇందులో 60 మంది హాజరుకాగా 27 మంది ఎంపిక చేసినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలని వినతి



తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

పీలేరు రూరల్ : మండలంలోని దళితుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో దళితుల భూసమస్యలు, ఇళ్ల సమస్యలు అధికంగా ఉన్నాయని, పరిష్కరించాలని కోరారు. స్మశాసన స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మౌలిక వసతులకు నోచుకోక దళితులు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. దళిత గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు చరణ్‌కుమార్, నరసింహులు, రెడ్డికుమార్, రమణ, రాజేష్, వంశీ, గంగులయ్య, రాజశేఖర్, రామలక్ష్మన్, బాను తదితరులు పాల్గొన్నారు.

ఈ -క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

పెద్దమండ్యం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలకు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయాలని వాల్మీకిపురం వ్యవసాయశాఖ ఏడీ వాణీశ్రీ అన్నారు. మండలంలోని వెలిగల్లు, పెద్దమండ్యం, ముసలికుంట గ్రామాలలో రైతు సేవా కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రాలలో రికార్డులను పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉన్న ఎరువుల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అలాగే పంటల సాగులో రైతులకు సిబ్బంది తమ సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన పంటలకు ఈ క్రాప్ నమోదు చేయాలని అన్నారు.

రేషన్‌షాపులు తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



రేషన్‌షాపులో బియ్యం తూకాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : పట్టణంలోని రేషన్‌షాపులను సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం సివిల్ సప్లయిస్ డీటీ రెడ్డెప్పతో కలిసి సబ్ కలెక్టర్ పట్టణంలోని రాజీవ్‌నగర్, ఎస్వీఆర్ లేఅవుట్‌లోని షాపునెం 36, 37లను తనిఖీ చేశారు. రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతుందా అని ప్రశ్నించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రేషన్‌షాపులో స్టాక్ వివరాలు, వాటి ధరలను బోర్డులో ప్రదర్శించాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సరుకులు సక్రమంగా వస్తున్నాయా లేదా అన్ని ప్రశ్నించారు. ఎండీయూ ఆపరేటర్లు స్టాక్ ఎలా తీసుకెళతారు? పంపిణీ ఎన్ని గంటల నుంచి ఎన్ని గంటల వరకు జరుగుతుంది ? రోజుకు ఎంతమంది కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. గన్నీబ్యాగ్‌తో పాటుగా బియ్యం మూట ఎంత బరువు ఉంటుందనేది తూకం వేసి పరిశీలించారు. తేడా వచ్చిన బియ్యం ఎలా రికవరీ చేస్తారని అడిగారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రేషన్ పంపిణీ నిర్వహించాలన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీతాలు చెల్లించాలి



పెండింగ్ జీతాలు చెల్లించాలని నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు

మదనపల్లె : ప్రభుత్వ సర్వజన బోధన ఆస్పత్రిలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణమే చెల్లించాలని మంగళవారం మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్మికుల నిరసనకు సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తోపు కృష్ణప్ప మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రభుత్వ ఆస్పత్రిలో 18 ఏళ్లుగా జీడీఏలుగా, ఓటీ, ఆఫీస్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న 26మంది ఔట్‌సోర్సింగ్ కార్మికుల్లో కొంతమందికి 13 నెలలుగా, మరి కొంతమందికి 8 నెలలుగా జీతాలు రాలేదన్నారు. పెండింగ్ జీతాలు చెల్లించాల్సిందిగా మెడికల్ సూపరింటెండెంట్, సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే, కలెక్టర్, డీసీహెచ్ తదితరులకు ఎన్ని వినతులిచ్చినా తమకు న్యాయం జరగలేదన్నారు. ఈ విషయాన్ని మీడియా దృష్టికి తీసుకెళ్లినందుకు తమపై మరింత పనిభారం మోపుతూ వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. జీతాలు అడిగితే మెమోలు, ఆబ్సెంట్లు వేస్తామని బెదిరిస్తున్నారన్నారు. పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించని పక్షంలో కాంట్రాక్ట్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమస్యను ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో అమరావతి, ఉమా, పెద్దయ్య, లోకేష్, అహ్మద్, తులసి, ప్రభావతి, మృదుల, సుబ్రహ్మణ్యం, హరి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఆదుకుంటాం



భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : నియోజకవర్గంలోని ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తను ఆదుకుంటామని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం నీళ్ళ రవి, నడిమిచెర్ల పంచాయతీ కొత్తపల్లె భాస్కర్‌రెడ్డిని పరామర్శించారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు పార్టీకి, కార్యకర్తలకు అండగా ఉంటారని, ఎవ్వరూ అధైర్య పడవద్దన్నారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ శ్రీదేవి, మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడు, సర్పంచ్‌లు జల్లారాజగోపాల్‌రెడ్డి, నాగభూషన్‌రెడ్డి ఎంపీటీసీ సభ్యులు క్రిష్ణారెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, నాయకులు కరీముల్లా, జిలానీ, కెఎస్‌మస్తాన్, మధుసూదన్‌రెడ్డి, సింగల్‌విండో మాజీ అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, బాబురెడ్డి, తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

– ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి త్వరలో నిర్వహించనున్న గ్రామసభలు కీలకమైనవని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమణలతో పలువురు ఇబ్బందులకు గురయ్యారన్నారు. భూములు ఆన్‌లైన్ సమస్యలు ఉన్నవారు, ఇళ్ల స్థలాలు సమస్యలు ఉన్నవారు గ్రామ సభల్లో అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. పీలేరు మండలం త్వరలో మున్సిపాలిటీ కానుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి, రామ్మూర్తి, చాపల సూరి, కంచి సూరి, రాజ, హేమచంద్రారెడ్డి, జనసేన నాయకులు బెజవాడ దినేష్ తోపాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తప్పనిసరి



మహిళలకు రక్తహీనతతో కలిగే నష్టాలను వివరిస్తున్న సీడీపీఓ సుజాత

మదనపల్లె : బాలికలు, మహిళలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మదనపల్లె ప్రాజెక్ట్ పరిధిలోని బసినికొండ సెక్టార్, పట్టణంలోని ఇందిరానగర్ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుజాత మాట్లాడుతూ.. పౌష్టికాహార మాసోత్సవం సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు అన్ని కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. రక్తహీనతను నివారించేందుకు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్ వంటివాటిని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని కిశోరబాలికలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రక్తహీనతతో ఉన్న గర్భవతులు, బాలింతలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నుంచి ఎలాంటి రక్షణ పొందాలనే విషయమై డాక్టర్.ఝాన్సీలక్ష్మీ వివరించారు. చిన్నపిల్లల్లో వస్తున్న జలుబు, దగ్గు, విరేచనాలు తదితర వ్యాధులకు 104లో చెక్‌అప్ చేయించుకోవాలని తల్లులకు తెలిపారు. ఆధార్ లేని పిల్లలకు తప్పనిసరిగా ఆధార్ చేయించాలని బీపీసీ కల్యాణి తెలిపింది. అంగన్‌వాడీలో అందిస్తున్న ఆహారం గురించి తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకాంత, శాంతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంపీఆర్ భాను, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

– డీఎస్పీ డి.కొండయ్యనాయుడు

మదనపల్లె : వినాయకచవితి సందర్భంగా మదనపల్లె పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలకు తప్పనిసరిగా పోలీస్, ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ డి.కొండయ్యనాయుడు తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వినాయకచవితి ఉత్సవ నిర్వహణకు సంబంధించి పీస్‌కమిటీ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కొండయ్యనాయుడు మాట్లాడుతూ.. వినాయకచవితి సందర్భంగా మట్టి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తప్పనిసరి అని, మండపాల నిర్వాహకులు ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు చాంద్‌బాషా, కే.రామచంద్ర, రమేష్, కళావెంకటరమణ, విజయభారతి సేతు, పీస్ కమిటీ సభ్యులు బండి బాలాజీ, బండి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డాక్టర్ జవహర్‌బాబు

కలకడ : గర్భిణులు, బాలింతలు ఆసుపత్రికి వెళ్లడానికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జవహర్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. మూడు మాసాలు నిండిన ప్రతి కాబోయే తల్లి క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన మందులు, మాత్రలు ఉచితంగా ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాలలో అందజేస్తారని గుర్తుచేశారు. బీసీజీ వ్యాక్సిన్ ఇంకనూ మిగిలిపోయినవారికి అందించి వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్‌ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్లు వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మ, సిబ్బంది నాగిరెడ్డి, వాణి, శ్రీలక్ష్మి, బాగ్యమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, రమణమ్మ, రాజసులోచన, కనకమ్మ, అశ్విని, లావణ్య, ఆశవర్కర్లు పాల్గొన్నారు.